ఆర్‌కేపురంలో మహాసత్సంగం



మహాసత్సంగంలో పాల్గొన్న ప్రణవానందదాస్, ఉపేందర్‌రెడ్డి

ఎల్‌బీనగర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఆర్‌కేపురంలో సోమవారం ఇస్కాన్ ఆధ్వర్యంలో నగర సంకీర్తన అనంతరం మహాసత్సంగం నిర్వహించారు. అష్టలక్ష్మీ దేవాలయం నుంచి శ్రీరామకృష్ణాపురం కోఆపరేటివ్ సొసైటీ వరకు నగర సంకీర్తన చేశారు. అనంతరం మహాసత్సంగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇస్కాన్ బ్రహ్మచారి పూజ్య ప్రణవానందదాస్ భక్తులకు ఉపదేశం ఇచ్చారు. కార్యక్రమంలో ఇస్కాన్ ప్రతినిధులు శ్రీనివాస్ అతిప్రియదాస్, నర్సింగ్‌రావు, అష్టలక్ష్మీ ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు గౌరిశెట్టి చంద్రశేఖర్ గుప్తా, ఉపేందర్‌రెడ్డి, రామారావు,రమేష్‌బాబు, శ్రీకాంత్, విజయలక్ష్మి, నీలిమ, రాధ, సురేఖ, అర్చన పాల్గొన్నారు.

మూసీ నిర్వాసితులకు సెల్ఫ్‌హెల్ప్ గ్రూపుల ఏర్పాటు

ఓల్డ్‌మలక్‌పేట అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మూసీ రివర్‌బెడ్ ఇల్లు కోల్పోతున్న కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలనే ఉద్దేశంతో మహిళల కోసం సెల్ఫ్‌హెల్ప్ గ్రూపులను ఏర్పాటు చేసినట్టు మలక్‌పేట అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ యుగంధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం మలక్‌పేట డీపీ కార్యాయంలో ఆయన మాట్లాడుతూ.. నిర్వాసితుల్లో సుమారు 130 మంది మహిళలు ఉన్నారని, అందులో 120 మంది సెల్ఫ్‌హెల్ప్ గ్రూపులకు అర్హత సాధించినట్టు చెప్పారు. ఒక్కో గ్రూపులో 10 మంది చొప్పున యూనిట్‌గా ఏర్పాటు చేసి మొత్తం 12 గ్రూపులు తయారు చేశామని పేర్కొన్నారు. ఒక్కో యూనిట్ సభ్యులకు రూ. 10 లక్షల నుంచి రూ. 15 లక్షల వరకు రుణాలు ఇస్తామని తెలిపారు. మూసీ రివర్‌బెడ్ ఇళ్లు కోల్పోయిన కుటుంబాల మహిళలు సెల్ఫ్‌హెల్ప్ గ్రూపుల్లో చేరాలంటే మలక్‌పేట యూసీడీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

పెద్దఅంబర్‌పేట్‌లో 'ట్యాక్స్ ఫ్రీ' వ్యాపారం!

- ట్రేడ్ లైసెన్సు ఉండదు.. పన్ను చెల్లించరు
- వందల సంఖ్యలో అనుమతులు లేని వ్యాపారాలు
- పన్నుల రూపంలో కోట్ల ఆదాయం కోల్పోతున్న మున్సిపాలిటీ
- వ్యాపారులకు అండగా అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు
- ఉన్నత అధికారులు దృష్టి పెట్టాలని ట్యాక్స్ పేయర్‌ల డిమాండ్

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): 'కంచే చేను మేసిన' చందంగా తయారైంది నగర శివారు పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ అధికారుల తీరు. మున్సిపాలిటీ పరిధిలోని ఆదాయ వనరులను సద్వినియోగం చేసుకుని అభివృద్ధికి బాటలు వేయాల్సిన అధికారులు, అందుకు సహకరించాల్సిన ప్రజా ప్రతినిధులు వారి సొంత లాభం కోసం అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారు. దాంతో వివిధ పన్నుల రూపంలో మున్సిపాలిటీకి రావాల్సిన కోట్ల రూపాయల ఆదాయం అధికారులు, ప్రజా ప్రతినిధుల జేబుల్లోకి వెళ్తోంది. కనీసం ఒక్క రూపాయి కూడా మున్సిపాలిటీకి పన్ను చెల్లించని అక్రమార్కులు... కోట్ల రూపాయల వ్యాపారం సజావుగా సాగిస్తున్నారు.

అక్రమ సంపాదనకు అలవాటుపడ్డ అధికారులతో మున్సిపాలిటీ కోట్ల రూపాయల ఆదాయం కోల్పోతుంది. మున్సిపల్ శాఖ నిబంధనలు తొక్కేస్తున్న అధికారుల తీరుపై పట్టణ ప్రజల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కోట్ల ఆదాయానికి గండి..

జీహెచ్ఎంసీకి ఆనుకొని ఉన్న పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలో ట్రేడ్ లైసెన్సు లేని, ట్యాక్సులు చెల్లించని వ్యాపార సముదాయాలతో కోట్ల రూపాయల ఆదాయానికి గండి పడుతోంది. పురపాలిక పరిధిలో మొత్తం 1256 వ్యాపార సముదాయాలకు మాత్రమే ట్రేడ్ లైసెన్సు ఉన్నట్లు అధికారులు స్పష్టం చేస్తున్నారు. అనధికారికంగా మాత్రం వందల సంఖ్యలో వ్యాపార సముదాయాలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. వాటి నుంచి మున్సిపాలిటీకి ఎలాంటి ఆదాయం రావడం లేదు. కానీ నెల వారీగా అధికారులతో పాటు కొంతమంది ప్రజా ప్రతినిధులకు మామూళ్లు ముడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ట్యాక్సు చెల్లించని షెడ్డులో కోట్ల వ్యాపారం..

మున్సిపాలిటీ పరిధిలో ట్యాక్సులు చెల్లించని వ్యాపార సముదాయాల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. నగరం శివారుకు విస్తరిస్తుండడంతో అక్రమ నిర్మాణాలు కూడా అదే స్థాయిలో వెలుస్తున్నాయి. కొంతమంది వ్యాపారులు రాజకీయ పలుకుబడితో భారీ కమర్షియల్ షెడ్డుల నిర్మాణాలు చేపడుతున్నారు. నిబంధనలు పట్టించుకోకపోగా... మున్సిపాలిటీ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే నిర్మాణాలు చేస్తున్నారు. అక్రమంగా చేపట్టిన ఆ నిర్మాణాలకు కనీసం ట్రేడ్ లైసెన్సు, ఇంటి నంబర్ లేకుండానే



పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ కార్యాలయం(ఫైల్)

అందులో కోట్ల రూపాయల వ్యాపారం నిర్వహిస్తున్నారు. వాటి ద్వారా మున్సిపాలిటీ ప్రతి ఏడాది కోట్ల రూపాయల ఆదాయాన్ని కోల్పోతోంది.

అధికారుల నిర్లక్ష్యంతోనే...

మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డుల్లో పెద్ద ఎత్తున ట్రేడ్ లైసెన్సు, ఇంటి నంబర్ లేకుండా పన్నులు చెల్లించని వ్యాపార సముదాయాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. మొత్తం వార్డుల్లో సుమారు 100 నుంచి 300 వందల వరకు ఏలాంటి లైసెన్సులు లేని వ్యాపార సముదాయాలు కొనసాగుతున్నట్లు సమాచారం. పురపాలికలో ఎంత చిన్నదైనా, పెద్దదైనా కచ్చితంగా ట్రేడ్ లైసెన్సు తీసుకుని వ్యాపారం నిర్వహించాలి. కానీ ఇక్కడ మాత్రం అలాంటి నిబంధనలు అమలు కావడం లేదని స్పష్టంగా తెలుస్తోంది. అక్రమ నిర్మాణాలకు కనీసం ఇంటి నంబర్‌ను కూడా తీసుకోకుండా వాటిని యథేచ్ఛగా వ్యాపార కార్యాకలాపాలకు అద్దెకు ఇచ్చేస్తున్నారు. మున్సిపల్ చట్టం ప్రకారం అనుమతి లేని నిర్మాణాలకు 100 శాతం పన్ను విధించి వసూలు చేయాలి. కానీ ఇక్కడ అధికారులు మాత్రం ఆ దిశగా ఏలాంటి చర్యలు తీసుకోకపోవడం విడ్డూరం. ఒక్కో అక్రమ భారీ షెడ్డుల నుంచి ఏడాదికి సుమారు రూ. 5 నుంచి 20 లక్షల ట్యాక్సు వసూలయ్యే అవకాశం ఉంది. అయినా గత ఏడాది కాలంగా వాటి నుంచి ఒక్క రూపాయి కూడా వసూలు చేయలేదంటే అధికారుల అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. అధికారులు సక్రమంగా పని చేస్తే ఏడాదికి అక్రమ నిర్మాణాల ద్వారానే సుమారు 5 నుంచి 10 కోట్ల ఆదాయం సమకూరుతుందని స్పష్టంగా తెలుస్తోంది. పన్నులు చెల్లించని నిర్మాణదారులతో అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు కుమ్మకై ప్రభుత్వ ఆదాయానికి కోట్ల రూపాయలు గండి కొడతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అక్రమ నిర్మాణదారుల పట్ల అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై ట్యాక్స్ పేయర్‌లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పన్నులు చెల్లించని వ్యాపార సముదాయాలపై ఉన్నత అధికారులు దృష్టి పెట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

100 శాతం పన్ను విధిస్తాం..



మున్సిపల్ పరిధిలో అనుమతులు లేకుండా కొనసాగుతున్న వ్యాపార సముదాయాలకు 100 శాతం పన్ను విధిస్తాం. అనుమతులు లేకుండా కొనసాగుతున్న వాటిని గుర్తించి వాటికి నోటీసులు అందజేస్తున్నాం. అవసరమైతే ఉన్నత అధికారుల ఆదేశాలతో వాటిని సీజ్ చేస్తాం.

- రవీందర్‌రెడ్డి, కమిషనర్ పెద్దఅంబర్‌పేట్

ఈటలకు అభినందనలు



ఈటల రాజేందర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సామ రంగారెడ్డి

మన్సూరాబాద్, అక్టోబర్ 14 (ఆంధ్రజ్యోతి): జాయింట్ కమిటీ ఆన్ ఆఫీసర్స్ ఆఫ్ ప్రాఫిట్‌గా లోక్‌సభ సెక్రటేరియట్‌లో మల్కాజిగిరి పార్లమెంటు సభ్యుడు ఈటల రాజేందర్ ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఢిల్లీలోని ప్రమాణస్వీకారంలో పాల్గొన్న రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఈటలకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఎంపీ రఘునందన్‌రావు, నవజీవన్‌రెడ్డి

వికసిత్ భారత్‌లో భాగస్వాములు కావాలి

హయత్‌నగర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మెదక్ లోక్‌సభ సభ్యుడు ఎం.రఘునందన్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని పద్మావతి కాలనీలో చేపట్టిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. ఇప్పటి వరకు ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో 30 వేలకుపైగా సభ్యత్వ నమోదు చేయించామన్నారు. రానున్న రోజుల్లో సభ్యత్వ నమోదును మరింత వేగవంతం చేస్తామన్నారు. కార్యక్రమంలో హయత్‌నగర్ కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్ నర్సింహారెడ్డి, బీజేపీ ఎల్‌బీనగర్ నియోజకవర్గ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్, నాయకులు కళ్లెం రవీందర్‌రెడ్డి, బండారి భాస్కర్, డివిజన్ అధ్యక్షుడు ఉగాది ఎల్లప్ప, మహేష్, పార్వతి, గోవిందాచారి, యాదగిరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు భావన ఎంపిక



విద్యార్థిని భావన

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): నగర శివారు పెద్దఅంబర్‌పేట్‌లోని రాజశ్రీ విద్యామందిర్‌లో 8వ తరగతి చదువుతున్న పిట్టల భావన జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్టు స్కూల్ చైర్మన్ సిద్దంకి జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 9వ తేదీన నల్గొండలోని నాగార్జున కళాశాలలో నిర్వహించిన పోటీల్లో భావన ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి ఖోఖో జట్టులో స్థానం సంపాదించినట్టు తెలిపారు. ఈనెల 15వ తేదీ నుంచి 17వ తేదీ వరకు కోయంబత్తూర్‌లో జరుగనున్న జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో రాష్ట్ర జట్టు నుంచి భావన పాల్గొననున్నట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఖోఖో సంఘం కార్యదర్శి నాతి కృష్ణమూర్తి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంజుల, కార్యదర్శి తోట జయప్రకాష్, కోశాధికారి ముత్యాల మహేందర్, స్కూల్ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు ఉపాధ్యాయులు భావనకు అభినందనలు తెలిపారు.



క్రీడాకారిణి పూజితలకు ఆర్థిక సాయం అందజేస్తున్న శ్రీనివాస్ గుప్తా

క్రీడాకారుల ప్రతిభను గుర్తించాలి

మన్సూరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారుల్లో దాగివున్న ప్రతిభను గుర్తించి వారికి అండగా నిలవాలని టీపీసీసీ ప్రచారకమిటీ రాష్ట్ర కోకన్వీనర్, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా పేర్కొన్నారు. జాతీయ యోగాసన పోటీలకు ఎంపికైన విద్యార్థిని పూజితను ప్రోత్సహిస్తూ నాగోల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఉప్పల ఫౌండేషన్ ద్వారా ఆమె ఖర్చుల నిమిత్త ఆర్థిక సాయం అందజేసినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో క్రీడాకారిని పూజిత తల్లి లక్ష్మి, పూర్ణ, డాక్టర్ ఏఆర్ గుప్తా, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.



అనాథ విద్యార్థులకు రూ. 50 వేల చెక్కు అందజేస్తున్న మోహన్ రెడ్డి

అనాథ విద్యార్థులకు రూ. 50 వేల విరాళం

మన్సూరాబాద్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ విజయశ్రీకాలనీ అధ్యక్షుడు జొన్నాడ మోహన్‌రెడ్డి తల్లిదండ్రులు నారాయణరెడ్డి, నాగమణి స్వర్గీయులు కావడంతో మొదటి వర్ధంతి సందర్భంగా అనాథ విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేశారు. సోమవారం ఆర్కేపురం డివిజన్ చిత్రలేఅవుట్‌లోని అనాథ విద్యార్థి గృహ విద్యార్థుల వసతులు, చదువులకు గాను తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా రూ. 50 వేలు గృహ అధ్యక్షుడు మార్గం రాజేష్‌కు అందజేశారు. కార్యక్రమంలో మోహన్‌రెడ్డి సతీమణి మీనా, కుమారుడు జ్ఞానసాయిరెడ్డి, జంగారెడ్డి, హర్ష తదితరులు పాల్గొన్నారు.



నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న శ్రీ శారద ట్రస్ట్ చైర్మన్ శారద తదితరులు

లెప్రసీ కుటుంబాలకు నిత్యావసరాల పంపిణీ

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): దసరా పండగను పురస్కరించుకొని శ్రీశారద ట్రస్ట్ ఆధ్వర్యంలో పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్, సంతోష్‌నగర్ కాలనీలోని 50 లెప్రసీ కుటుంబాలకు ట్రస్టీ చైర్మన్ శారద నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. లెప్రసీ కుటుంబాలకు తమ వంతు సహాయ సహకారం ఎప్పుడూ ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్లాప్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ ట్రస్ట్ చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు శ్రీలక్ష్మి, ప్రసులాంబ, భవాని ప్రసాద్, త్యాగరాజు, దక్షిణమూర్తి, ప్రవీణ్, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

ఒక్క ఇటుక కూల్చనివ్వను



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిసిన ఫణిగిరికాలనీ వాసులు

ఎల్‌బీనగర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మూసీ సుందరీకరణలో భాగంగా మీ ఇళ్లకు సంబంధించిన ఒక్క ఇటుక కూడా కూల్చకుండా చూస్తానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మూసీపరివాహక ప్రాంతవాసులకు భరోసా ఇచ్చారు. చైతన్యపురి డివిజన్ ఫణిగిరికాలనీ వాసులు సోమవారం సుధీర్‌రెడ్డిని క్యాంపు కార్యాలయంలో కలిసి విన్నవించారు. ఓ ఛానెల్‌లో ఫణిగిరికాలనీ పరిసరాల్లో మూసీ పరివాహక ప్రాంతంలో ఉన్న కట్టడాలను కూల్చివేస్తారంటూ రావడంతో ఆందోళన చెందిన ఆ ప్రాంతవాసులు ఎమ్మెల్యేను కలిసి తమ గోడును చెప్పుకొన్నారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్‌రెడ్డి, పవన్, కడియం మోహన్‌రాజ్, కాలనీవాసులు వేణుగోపాల్, వీరాచారి, జ్యోతి ఆంజనేయులు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన



పైపులైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ అరుణా సురేందర్ యాదవ్

మన్సూరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలోని సహదేవ్‌సింగ్ నగర్‌లో రూ.4.10 లక్షలతో చేపట్టనున్న వాటర్ పైప్‌లైన్ పనులకు సోమవారం నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్ యాదవ్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల సురేందర్ యాదవ్, జలమండలి మేనేజర్ అర్చన, కేసిరెడ్డి పద్మారెడ్డి, సత్యనారాయణ, జీహెచ్ఎంజీ జవాన్ లక్ష్మయ్య పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనుల పరిశీలన

నాగోల్ డివిజన్ బండ్లగూడ పెట్రోల్ బంక్ నుంచి తాజా హోటల్ వరకు చేపట్టిన బీటీ రోడ్డు పనులను కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్ యాదవ్ సోమవారం పరిశీలించారు.

నూతన భవనంలోకి యూపీహెచ్‌సీ



మున్సిపల్ కాలనీలో నూతనంగా నిర్మించిన యూపీహెచ్‌సీ భవనం

ఓల్డ్‌మలక్‌పేట అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మలక్‌పేట అర్బన్‌ప్రాథమిక ఆరోగ్యకేంద్రం(యూపీహెచ్‌సీ)పోచమ్మ దేవాలయం ఎదురుగా ఉన్న మున్సిపల్ కాలనీలో నూతనంగా నిర్మించిన భవనంలోకి తరలించారు. విజయదశమి నుంచి నూతన భవనంలో ఓపీ వైద్యచికిత్సలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. రూ. 50 లక్షలతో అధునాతన భవనం నిర్మించారు. కొన్ని అనివార్యకారణాల వల్ల అధికారికంగా భవనం ప్రారంభించలేదని, వైద్యపరికరాలు ఇతర సామగ్రి నూతన భవనంలోకి తరలించి వైద్యచికిత్సలు అందిస్తున్నట్టు తెలిపారు. త్వరలో నూతన యూపీహెచ్‌సీ భవనం అధికారికంగా ప్రారంభిస్తామని డిప్యూటీ డీఎంహెచ్ఓ బ్రిజున్నీసా తెలిపారు. వైద్య చికిత్సల కోసం వచ్చేవారు మున్సిపల్‌కాలనీలోని నూతన భవనం వద్దకు రావాలని సూచించారు. యూపీహెచ్‌సీ ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ తరుణి కొనసాగుతున్నారు.

దుర్గామాత ఊరేగింపు



నిమజ్జన ఊరేగింపులో శివసత్తులు, సత్యనారాయణగౌడ్

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పసుమాములలో చిరంజీవి యువత రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మోడెపు సత్యనారాయణగౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాతను ఆదివారం రాత్రి స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ప్రకాష్‌గౌడ్, వేణు, గోవర్ధనం నవీన్, శ్యామ్‌గౌడ్, శ్రీహరి, చరణ్, శివ, తదితరులు పాల్గొన్నారు.



వేలంలో దుర్గామాత చీరను దక్కించుకున్న గడ్డ కృష్ణ దంపతులు

దుర్గామాత చీర వేలం రూ.45,116వేలు

చంపాపేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): చంపాపేటలోని హరిజనబస్తీలోని నవజీవన జ్యోతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత నిమజ్జనం సందర్భంగా అమ్మవారి చీరకు వేలంపాట నిర్వహించారు. బస్తీకి చెందిన గడ్డం కృష్ణ దంపతులు వేలంపాటలో అమ్మవారి చీరను రూ.45,116కు దక్కించుకున్నారు. కార్యక్రమంలో బస్తీవాసులు పాశం శ్రీశైలం, కట్టా వెంకటేష్, అనిల్, సుధీర్, రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ వైస్ ఎంపీపీని పరామర్శించిన ఎమ్మెల్యే



యశోద ఆస్పత్రిలో శ్రీధర్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): తీవ్ర అస్వస్థతకు గురై మలక్‌పేట యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అబ్దుల్లాపూర్‌మెట్ మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కొలన్ శ్రీధర్‌రెడ్డిని సోమవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సీహెచ్ భాస్కరాచారి, మాజీ సర్పంచ్‌లు ఇరుగు చిత్తారి, కవాడి శ్రీనివాస్‌రెడ్డి, కొలన్ కొండల్‌రెడ్డి, రాసాల రాముయాదవ్, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీఎస్ సాయిబాబా మృతి తీరనిలోటు



సాయిబాబా భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పౌర హక్కుల ఉద్యమకారుడు కామ్రేడ్ జీఎస్ సాయిబాబా ఆకస్మిక మృతి వామపక్ష ఉద్యమాలకు తీరనిలోటని సీపీఐ నాయకులు విచారం వ్యక్తం చేశారు. ఆయన మృతి పట్ల సంతాపం తెలుపుతూ మౌలాలిలోని సాయిబాబా భౌతికకాయానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటీ నర్సింహ, వీఎస్ బోస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారి, హైదరాబాద్ నగర కార్యదర్శి ఛాయాదేవి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

డీసీసీబీ చైర్మన్‌కు కృతజ్ఞతలు



దసరా పండగను పురస్కరించుకొని డీసీసీబీ ఉద్యోగులకు 45 రోజుల బోనస్‌ను ఇచ్చినందుకు సంతోషం వ్యక్తం చేస్తూ డీసీసీబీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు సోమవారం డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్యను తుర్కయంజాల్‌లోని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి నర్సిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

- హయత్‌నగర్, అక్టోబర్ 14(ఆంధ్రజ్యోతి)

ప్రజావాణిలో 33 ఫిర్యాదులు



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 33 ఫిర్యాదులు వచ్చినట్టు అధికారులు తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, లా ఆఫీసర్ చంద్రావతితో కలిసి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారు లు తక్షణమే స్పందించి వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని, ఆర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తూ సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

గ్రూప్ - 1 పరీక్షకు 27 పరీక్షా కేంద్రాలు: కలెక్టర్

మేడ్చల్ అక్టోబర్ 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రూప్- 1 సర్వీసెస్ మెయిన్స్ రాత పరీక్షకు జిల్లాలో 27 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ గౌతమ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21వ తేదీ నుంచి 27 వరకు జరుగనున్న పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పరీక్షలు సజావుగా జరిగే లా చూడాలని, రోజూ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు జరిగే పరీక్షకు అభ్యర్థులను మధ్యాహ్నం 12.30 నుంచి 1.30 గంటల వరకు మాత్రమే పరీక్షా కేంద్రాల్లోని అనుమతిస్తామన్నారు.

కోడలిపై వేడినీళ్లు పోసిన అత్త, ఆడపడుచుపై కేసు

సంతోష్‌నగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కోడలిపై వేడినీళ్లు పోసిన అత్త, ఆడపడుచుపై సంతోష్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. నిజామాబాద్‌కు చెందిన నజియాబేగం(33)కు సంతోష్‌నగర్ ఓవైసీ కాలనీకి చెందిన షేక్ షబ్బీర్‌తో వివాహం అయింది. వీరికి నలుగురు పిల్లలు. షబ్బీర్ ప్రస్తుతం దుబాయ్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. నజియాబేగంకు అత్త మహ్మదీయ బేగంతో తరచూ గొడవలు జరుగుతుండడంతో పిల్లలతో కలిసి అక్కడే అద్దె ఇంట్లో ఉంటోంది. ఆదివారం పిల్లలు నానమ్మ వద్దకు వెళ్లారు. వారిని తీసుకువచ్చేందుకు నజియా వెళ్లింది. అత్త, ఆడపడుచు నజీరాబేగం ఆమెతో గొడవపడ్డారు. తల్లీకూతుళ్లు ఇద్దరూ కలిసి నజియాబేగంపై వేడినీళ్లు పోశారు. బాధితురాలు 40 శాతం గాయాలతో ఓవైసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. నజియాబేగం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
రాజు : 99854 02786